బల్దియాపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ
- అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం
- పాతవారికే డివిజన్ అధ్యక్ష పదవులు


జిల్లా కాంగ్రెస్ భవన్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగిరేలా కృషి చేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు వాటంతట అవే వస్తాయన్నారు. 2017కు ముందున్న వారికి డివిజన్ స్థాయి అధ్యక్ష పదవులు ఇవ్వాలని అధిష్టానం సూచించిందన్నారు. పాత, కొత్త తేడా లేకుండా అందరూ పార్టీ కోసం పనిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిజామాబాద్ అర్బన్‌కు 3500 కేటాయించగా, అందులో కేవలం 752 మాత్రమే అర్హులుగా నిలవడం బాధాకరమని అన్నారు. నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా స్థానిక నాయకులు చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను ఇందిరమ్మ కమిటీ నాయకులతోనే పంపిణీ చేస్తామని తెలిపారు. రూ. 50 వేలు, రూ. లక్ష రాజీవ్ యువ వికాస్ రుణాల కోసం బ్యాంక్ సిబిల్ అవసరం లేదన్నారు. అర్హులైన వారికి రుణాలు అందిస్తామన్నారు. ఇదివరకు రూ. లక్షకు పైగా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు రుణ పరిమితి, రూ. 50 వేలు, రూ. లక్షకు మార్చుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుడు తిరుపతి మాట్లాడుతూ.. డివిజన్ అధ్యక్షుల కోసం ఆయా డివిజన్ నాయకులు ఏకగ్రీవంగా ఒకరి పేరు సూచిస్తూ జాబితాను పార్టీ నగర అధ్యక్షుడు కేశ వేణుకు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నగర అధ్యక్షుడు నుడా చైర్మన్ కేశ వేణు, నరాల రత్నాకర్, విపుల్‌గౌడ్, బొబ్బిలి రామకృష్ణ, జావెద్ అక్రమ్, రాంభూపాల్, సంతోష్, నరేందర్ గౌడ్, సయ్యద్ ఖైసర్, నరేందర్‌సింగ్, రేవతి, పోల ఉష తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తా


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా

నిజామాబాద్‌నాగారం: పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన పద్మశాలి సంఘం నగర నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి, పద్మశాలి సమాజ ఉన్నతికి తన పూర్తి సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. అనంతరం సంఘ సభ్యులను సన్మానించారు. అదేవిధంగా నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్‌హౌస్‌లో రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌ను, నుడా చైర్మన్ కేశవేణును పద్మశాలి సంఘం నగర నూతన కార్యవర్గ సభ్యులు కలిశారు. తాహెర్‌ను సంఘ సభ్యులు సన్మానించారు. కార్యక్రమాల్లో పద్మశాలి సంఘం నగర అధ్యక్షుడు పెంట దత్తాత్రి, బిల్ల మహేశ్, చౌటి భూమేశ్వర్, మోర సాయిలు, పల్నాటి రఘు, మైసల నారాయణ, కన్న దుబ్బరాజాం, బాగుల శ్రీనివాస్, ఎనగందుల సుభాష్, బూస రవి, బొడ్డు గంగా ప్రసాద్, కస్తూరి గంగరాజు, ఎనగందుల మురళి, అవధూత రాములు, సత్యపాల్, భీమర్తి రవి, బొట్టు వెంకటేశ్, పల్నాటి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

దళిత రత్న అవార్డుల ప్రదానం



నిజామాబాద్ అర్బన్ : నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో దళిత రత్న అవార్డుల కమిటీ చైర్మన్ ఇటుక రాజు జిల్లాకు చెందిన దళిత నాయకులకు శుక్రవారం అవార్డులను అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో పులి జైపాల్, డాక్టర్ బుర్ర లక్ష్మణ్, కోటేశ్వరరావు, సదాశివరావు, విజయ కాంతారావు, అబ్బులు, సాయిలు, లత, జ్యోతి, కొత్తపల్లి దుర్గయ్య ఉన్నారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ సమీపంలో అనుమతి లేకుండా సీబీఎస్ పాఠశాల అంటూ అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్న ఓ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాలా శుక్రవారం డిమాండ్ చేశారు. రూరల్ మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. పాఠశాల భవనం నిర్మాణ దశలో ఉండగానే అడ్మిషన్లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ మండల కార్యవర్గ నియామకం

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గాన్ని నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ తెలిపారు. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా నవీన్, చిరంజీవి, బాల్‌రెడ్డి, రాజకళ, ప్రధాన కార్యదర్శులుగా ఆకుల లత మహేందర్, కుంట శ్రీనివాస్, కార్యదర్శులుగా తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, సాయిలు, మమత, కోశాధికారిగా కుంట భూషణ్‌తో పాటు మరో ఇరవై మంది కార్యవర్గ సభ్యులను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు అహల్యాబాయి జయంతి

సుభాష్‌నగర్: మహారాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి శుక్రవారం తెలిపారు. నగరంలోని గోల్ హనుమాన్ మందిరం నుంచి కోటగల్లి మార్కండేయ మందిరం వరకు ఈ శోభాయాత్ర ఉంటుందని, యాత్రకు ముఖ్యఅతిథులుగా అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. శోభాయాత్రలో పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ సభ్యుడిగా రామకృష్ణ నియామకం



రామకృష్ణను సన్మానిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, న్యాయవాది జీవీ రామకృష్ణ రాష్ట్ర డిసిప్లినరీ కమిటీ సభ్యుడిగా నియామకం కావడంతో పలువురు నాయకులు ఆయనను అభినందించారు. శుక్రవారం కాంగ్రెస్ భవన్‌లో ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ శాలువాతో సత్కరించారు. పార్టీకోసం పనిచేసిన వారికి పదవులు వాటంతట అవే వస్తాయని తెలిపారు. రామకృష్ణను కాంగ్రెస్ నాయకులు నరేందర్ సింగ్, సేవాదల్ సంతోష్, బొబ్బిలి రామకృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నిజామాబాద్ నాగారం: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ సభ్యుడిగా నియమితులైన జి రామకృష్ణను ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రామకృష్ణ గత 35 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల నాగరాజ్, పూజారి గంగాధర్, రాంభూపాల్, బాబు, ప్రమోద్, భూషణ్, మనోహర్ రవి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ధర్పల్లి: మండలంలోని హొన్నాజీపేట్‌లోని జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి మిత్రులు అందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. గురువులను ఘనంగా సన్మానించారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్


ధర్మారం(బి)లో బాధితులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

డిచ్‌పల్లి: అనారోగ్యంతో మెరుగైన వైద్యం చేయించుకోలేని బాధితులకు సీఎంఆర్ఎఫ్ వరంగా మారిందని డీసీసీ డెలిగేట్ వాసుబాబు పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలో శుక్రవారం ఎనిమిది మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సైతం తిరిగి మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మురళి, మురారి, సోమనాథ్, పిచ్చయ్య, యాదయ్య, వెంకట్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఖలేజా-10.25, 4.30, భైరవం-1.30, 7.35, 10.35
స్క్రీన్-2	ఘటికాచలం(తెలుగు)-11.00, ఖలేజా(తెలుగు)-1.30, 7.30, 10.30, షష్టిపూర్తి(తెలుగు)-4.35
స్క్రీన్-3	లవ్ కరు యా(హిందీ)-11.00, నరివెట్ట(తెలుగు)-1.30, ఘటికాచలం(తెలుగు)-4.20, సింగిల్(తెలుగు)-7.30, షష్టిపూర్తి(తెలుగు)-10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మిషన్ ఇంపాజిబుల్(ఇంగ్లీష్)-10.55, 7.20, కరాటే కిడ్ లెజెండ్స్(తెలుగు)-2.25, భూల్ చుక్ మాఫ్(హిందీ)-4.40, 10.50
స్క్రీన్-2	భూల్ చుక్ మాఫ్(హిందీ)-11.00, సింగిల్(తెలుగు)-1.40, 7.35, భైరవం(తెలుగు)-4.25,10.20
స్క్రీన్-3	కరాటే కిడ్ లెజెండ్స్(తెలుగు)-11.25, షష్టిపూర్తి(తెలుగు)-1.40, సింగిల్(తెలుగు)-4.50, కరాటే కిడ్ లెజెండ్స్(ఇంగ్లీష్)-7.45, 10.00
స్క్రీన్ -4	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(తెలుగు)-11.05, 4.15, 10.20

శుభం(తెలుగు)-1.35 ఖలేజా(తెలుగు)-6.45
లలితామహల్ భైరవం దేవి కరాటే కిడ్ లెజెండ్స్
నటరాజ్ కేసరి చాప్టర్-2 విజయ్ ఖలేజా

బాజిరెడ్డి జగన్ జన్మదినం



సిరికొండ: బీఆర్ఎస్ రూరల్ నియోజకవర్గ నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంతో పాటు రావుట్ల తదితర గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జగన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, తోట రాజన్న, దువ్వూరి సంతోష్ రెడ్డి, బాజిరెడ్డి రమాకాంత్, అన్సర్, భూషణ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం స్థల పరిశీలన

రుద్రూర్: పోతంగల్ మండలం పీఎస్ఆర్ నగర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం కేటాయించిన స్థలాన్ని శుక్రవారం టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతి రెడ్డి పరిశీలించారు. ఆయనతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ గౌడ్, డీఈలు సుబ్బరాయుడు, రవికుమార్, తహసీల్దార్ గంగాధర్, సర్వేయర్ పోశెట్టి, మాజీ జెడ్పీటీసీలు శంకర్ పటేల్, పుప్పాల శంకర్, మాజీ ఎంపీపీ గంధపు పవన్, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఆర్వోబీ పనులు



నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం పెద్ద క్రేన్ సహాయంతో పిల్లర్ల వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో కాంక్రిట్‌ను నింపుతున్నారు. పనులు చేపట్టేందుకు పెద్ద క్రేన్ రావడంతో ప్రయాణికులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

క్లుప్తంగా

ఘనంగా బీరప్ప కల్యాణం



నిజామాబాద్ రూరల్: నగర శివారులోని బోర్గాం(పి)లో కుర్మ సంఘం సభ్యులు బీరప్ప కామరాతి కల్యాణ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ వేడుకలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు గొంగడి, మేక పిల్లను అందించారు. సంఘం పెద్దలు, ఒగ్గు కళాకారులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కల్పించాలి

నిజామాబాద్ సిటీ: మహిళలకు అనేక చట్టాలు ఉన్నా భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా ప్రత్యేక శిక్షణా తరగతులను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అనేక మార్పులు చెందుతున్నా, టెక్నాలజీ పెరుగుతున్నా మహిళలపై హింస ఆగడం లేదన్నారు. చట్టాలు సరిగా అమలుకాకపోవడం వల్లే మహిళలపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. నాయకులు సుజాత, అనిత, హసీనా బేగం, కళ, శారద, శ్రీదేవి, రేఖ, స్వప్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ



డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి, మిట్టాపల్లి తండా, ఘన్‌పూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, సీహెచ్ నర్సయ్య, మైనార్టీ నాయకులు డాక్టర్ షాదుల్లా, రామకృష్ణ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్లు లేని పేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు రమేశ్, నరేశ్, హరీశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హబీబ్, బాల గంగాధర్, నంద్యానాయక్, డాక్టర్ లింబాద్రి, సతీశ్‌రెడ్డి, శక్కరికొండ సాగర్, వెంకటేశ్, ఎన్నోల్ల గంగాధర్, వీడీసీ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

లోతు దుక్కులతో అధిక ప్రయోజనాలు



రెంజల్(బోధన్): వేసవిలో లోతు దుక్కుల ద్వారా నేల ద్వారా సంక్రమించే తెగుళ్లు, పురుగులు మాత్రమే కాకుండా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని రుద్రూర్ ప్రాంతీయ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. శుక్రవారం రెంజల్ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రాకేశ్, పద్మావతిలు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. విత్తన శుద్ధి, ఎరువుల వాడకం, పురుగు మందుల వినియోగం, తెగుళ్ల నివారణ, తదితర అంశాలపై వివరించారు. ఏవో శ్రీనివాస్‌రావ్, రెంజల్ విండో చైర్మన్ మొయినొద్దిన్, రైతులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,300	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	88,892		

- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	60	80	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	30	50
బీన్సుకాయ	150	200	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	60	బీట్‌రూట్	30	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	40	60
కొత్తిమీర	60	80	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	90	మామిడికాయ	30	50

-సుభాష్‌నగర్

అటెన్షన్ ప్లీజ్

గుంతల రోడ్డుతో అవస్థలు



రూరల్ మండలం కాలూరుకు వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలు తేలి ప్రమాదకరంగా మారింది. దీనికితోడు వర్షపు నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్
- నిజామాబాద్

అత్యవసర సేవలకు 'శానిటరీ స్పెషల్‌టీం'



బల్దియా వద్ద సిద్ధంగా ఉన్న స్పెషల్ టీం సభ్యులు, స్పెషల్ టీం జవాన్ ప్రేమ్ కుమార్

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అత్యవసర పనుల కోసం శానిటరీ విభాగానికి చెందిన పది మంది సిబ్బందితో స్పెషల్ టీంను అధికారులు ఏర్పాటు చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున అర్ధరాత్రి వేళ అత్యవసర సేవలకు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచినా, చెట్లు విరిగిపడినా, ఇతర అత్యవసర సేవలకు బల్దియా అధికారులు పది మందితో కూడిన పారిశుద్ధ్య కార్మికుల ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ప్రతి రోజు రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు విధులు నిర్వహించనున్నారు. వర్షంలో సైతం పని చేసేందుకు వీరికి రెయిన్‌కోట్స్, చేతులకు గ్లౌవుస్, తలకు హెల్మెట్స్, రాత్రివేళల్లో కనిపించేందుకు ఆప్రాన్స్, ఇతర పరికరాలను అందించారు. వర్షాకాలం వరకు ఈ స్పెషల్ టీం ప్రతిరోజు డ్యూటీలో ఉంటుంది. ఈ బృందానికి జవాన్ ప్రేమ్‌కుమార్‌ను సైతం కేటాయించారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ ఆదేశాలతో ఈ స్పెషల్ టీంను సిద్ధంగా ఉంచినట్లు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయకుమార్ తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే


ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్‌లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నందిపేట పలుగుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, నర్సారెడ్డి ,రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై, ఉపాధి హామీ కూలీలపై చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని వీడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకటస్వాములు అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధి రంగానికి నిధులు తగ్గించారని, పట్టణ ప్రాంతంలో కూడా పేద కూలీలు పెరిగిపోతున్నారని వీరికి ఉపాధి కల్పించాలన్నారు. జాబ్ కార్డు లేనివారికి జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, శంకర్, చంద్రకాంత్, శేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పట్టాదారులకే భూమి కబ్జా ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరికొండ : సిరికొండ రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 532లో పట్టాలు కలిగిన లబ్ధిదారులకు భూమిని కబ్జా ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు రమేశ్ డిమాండ్ చేశారు. సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో పట్టాదారులతో కలిసి తహసీల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమిని రెవెన్యూ భూమిగా గుర్తించి రెండు వందల మంది పేదలకు పట్టాలిచ్చారని తెలిపారు. అటవీ అధికారులు ఆ భూమి అటవీ భూమిది అంటు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, సాయారెడ్డి, లింబాద్రి, రమేశ్, నరేశ్, ఎర్రన్న, బాల్‌రెడ్డి, రాజపండరి తదితరులు పాల్గొన్నారు.